# శ్రీ శంకర భగవత్పాదుల వారి

# 1. అనాత్మశ్రీ విగర్హణం

# 2. ఆత్మ పూజ



: వ్యాఖ్యాత :

'అభినవ వ్యాస', 'జ్ఞాన ప్రపూర్ణ'

శ్రీ దేవిశెట్టి చలపతిరావు

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం : : చిలకలూరిపేట.

# పూజ్య గురుదేవులు



జ్ఞానప్రపూర్ణ

**శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు B.Sc., (Ag)**

వ్యవస్థాపకులు : ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట


Contact : (Mobile) 80085 39770 / (Land Line) 08647 254716

Email : care@srichalapathirao.com


Visit www.srichalapathirao.com to listen Pravachanas

# గురుదేవుల పరిచయము

శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు 1946 సెప్టెంబర్ 12 వ తేదీన గుంటూరు జిల్లా తుర్లపాడు గ్రామంలో జన్మించారు. తండ్రి వీరరాఘవయ్య, తల్లి పుల్లమ్మ. వీరి నివాసం చిలకలూరిపేట. ప్రాధమిక విద్య తుర్లపాడు గ్రామంలోను, ఉన్నత విద్య చిలకలూరిపేట లోను అభ్యసించి, బాపట్ల వ్యవసాయ కళాశాల నుండి B.Sc. (Ag.) ప్రధమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

పూవు పుట్టగానే పరిమళిస్తుందనే నానుడి ప్రకారం 4 సంవత్సరాల వయస్సు నుండి 8 సంవత్సరాల వయస్సు వరకు వీరి నోటి నుండి ఏ వాక్కు వస్తే అలాగే జరిగేది. పూర్వ జన్మ సంస్కారం వల్ల వీరు 12 సంవత్సరాల వయస్సు నుండే రామాయణ, భారత, భాగవత గ్రంధాలను, పురాణాలు - ప్రబంధాలను అధ్యయనం చేయటం ప్రారంభించారు. ప్రత్యేకంగా మహాభారతంపై విశేషమైన ఆసక్తి కలిగి, 20 సంవత్సరాలకు పైగా ఆంధ్ర మహాభారతం, సంస్కృత మహాభారత గ్రంధాలపై తీవ్ర పరిశోధనలు గావించి, చిలకలూరిపేటలో 1988 నుండి 1992 వరకు ధారావాహిక ప్రవచనములు చేసి, శ్రోతల ప్రశ్నలకు అప్పటికప్పుడే జవాబులిస్తూ వారికి సందేహనివృత్తి గావించారు.

1990 నుండి చిలకలూరిపేట చిన్మయ మిషన్ కార్యదర్శిగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను, హెూమాలను, పూజలను, గీతాజ్ఞాన యజ్ఞాలను, సత్సంగాన్ని నిర్వహించారు. 1994 లో *ఆధ్యాత్మిక జ్ఞాన పీఠాన్ని* స్థాపించి, ప్రసన్న బండ్లమాంబ శ్రీ రాజమాతాదేవి వారిచే ప్రారంభింపజేశారు. అప్పటి నుండి ప్రతిరోజు సత్సంగము, ప్రతి నెల గీతాపారాయణలతో బాటు శ్రీకృష్ణ జన్మాష్టమి, గీతాజయంతి, శంకరాచార్య జయంతి, రమణమహర్షి జయంతి, ఆషాఢ - కార్తీక – మాఘ - వైశాఖ పౌర్ణమిల యందు ఆధ్యాత్మిక సదస్సులు, జన్మదినోత్సవం, విజ్ఞానయాత్రలు, వనసమారాధనలు, ధ్యానతరగతులు, వార్షికోత్సవం మొదలగు అనేక కార్యక్రమాలను జరుపుకొనుటలోను,

నిరంతర జప, ధ్యాన, ఆత్మవిచారణ, సాక్షీభావన, బ్రహ్మనిష్ఠ మొ||న సాధనలతో, పూర్తి ఆధ్యాత్మిక జీవితాలను గడుపుటలోను, మాకు సదా మార్గదర్శకులుగా ఉండి మా వెన్ను తట్టి, చేయిపట్టి ముందుకు నడిపిస్తున్న కర్మయోగులు, జ్ఞాన ప్రపూర్ణులు మా గురుదేవులు.

భగవంతుడు నిర్దేశించిన బాటలో పయనిస్తూ, తనలో నిక్షిప్తమైయున్న ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పదిమందికీ పంచాలనే సంకల్పంతో 1996 నుండి వివిధ పట్టణాలలో ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞముల ద్వారా భగవద్గీత, ప్రకరణ గ్రంధాలైన శంకరాచార్యుల వారి భజగోవిందం, తత్వబోధ, ఆత్మబోధ, వివేకచూడామణి, అద్వైతసారం, దక్షిణామూర్తి స్తోత్రం, అపరోక్షానుభూతి, శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర స్వాముల వారి ఆత్మవిద్యావిలాసం, శంభు నటనం, భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారి ఉపదేశసారం, నారద భక్తిసూత్రములు, బ్రహ్మ సూత్రములు, ఇంకా రామాయణ, భారత, భాగవతములు, అలాగే ఈశ, కేన, కఠ, ముండక, కైవల్య, తైత్తి రీయ, సూర్య, మొదలగు ఉపనిషత్తుల పైనను ప్రవచనములు చేస్తూ జ్ఞాన సుగంధాలను నలువైపుల ప్రసరింపజేస్తున్నారు. ఇప్పటి వరకు చిలకలూరిపేట, విజయవాడ ధర్మల్ పవర్ స్టేషన్, రాయలసీమ ధర్మల్ పవర్ ప్రాజెక్ట్, వినుకొండ, శ్రీశైలం, కాశీ, తిరువణ్ణామలై, నెల్లూరు, బాపట్ల మొదలగు చోట్ల 145 ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞములను చేశారు. 1998 లో వి.టి.పి.యస్.ఎ. కాలనీ యందు 108 హోమకుండాలతో వాసుదేవ మహాయజ్ఞాన్ని నిర్వహించారు.

1993 లో భగవద్గీత ముగింపు సందర్భంగాను, 2001 లో వివేక చూడామణి ముగింపు సందర్భంగా చిలకలూరిపేటలోను; 1999 లో భగవద్గీత ముగింపు సందర్భంగాను, 2002 లో వివేక చూడామణి ముగింపు సందర్భంగా వి.టి.పి.యస్.లోను శిష్యులందరూ గురుదేవులను ఘనంగా సన్మానించారు. 2006 లో 100 జ్ఞాన యజ్ఞాలు పూర్తిగావించిన సందర్భంగా శిష్యులందరూ కలసి 'జ్ఞానప్రపూర్ణ' బిరుదుతోను, 2011 లో

మహాభారత పరిశోధనలో గురుదేవుల కృషికి 'అభినవ వ్యాస' బిరుదుతోను గురుదేవులను సత్కరించటం జరిగింది.

1994 లో సామాన్యులకు కూడా వేదాంత విషయాలు సులభంగా అర్ధమయ్యే రీతిలో గురుదేవులు 'కర్మసిద్ధాంతం' అనే చిన్న గ్రంధాన్ని రచించి ప్రచురింపజేశారు. తిరిగి 2002 లోను, 2008 లోను, 2009 లోను పునర్ముద్రణ జరిగింది. 1998 లో శుక్ల యజుర్వేదమునందలి 'ఈశావాస్యోపనిషత్తు' పై అందరికి అర్ధమయ్యే విధంగా సరళమైన, వాడుకభాషలో విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. 1999 లో శంకరాచార్యుల వారి 'భజగోవిందం' పై అందరికీ అతి సులభంగా అర్ధమయ్యే విధంగా, ఎంతో వివరంగా, వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. తిరిగి 2009 లో ద్వితీయ ముద్రణ జరిగింది.

'భగవద్గీత' అనగానే "అమ్మో! అది మనలాంటి సామాన్యులకు కాదు" అనుకొనేవారు "భగవద్గీతను ఇంత తేలికగా అర్ధం చేసుకోగలమా?" అనుకొనేటట్లు ప్రవచనములు చేస్తున్న గురుదేవులు 2011 లో 1,2 అధ్యాయములను ప్రచురింపచేశారు. ఇప్పుడు 2012 లో భగవాన్ రమణ మహర్షుల "ఉపదేశసారము"నకు, సామవేదం నుండి గ్రహించబడిన కేనోపనిషత్తుకు విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింప చేశారు. ఇవిగాక ప్రస్తుతం నారదభక్తి సూత్రాలపై, శంకరాచార్యుల వారి ఆత్మబోధ, దక్షిణామూర్తి స్తోత్రంపై ఎంతో వివరణాత్మకంగా, సోదాహరణంగా, విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింప జేస్తున్నారు.

ఇవి గాక విజయవాడ నుండి వెలువడే *ధ్యానమాలిక* మాసపత్రికలో 2008 నుండి భగవద్గీతను, 2009 నుండి మహాభారతమును ధారావాహికంగా ప్రచురిస్తున్నారు. ఇక దేశవిదేశాలలో నున్న తెలుగువారు ఈ జ్ఞానాన్ని గ్రహించటానికి వీలుగా www.srichalapathirao.com పేరుతో ఒక వెబ్ సైట్ ను ప్రారంభించటం జరిగింది. దీని

ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానపీఠం కార్యక్రమాలను, గురుదేవుల ప్రవచనాలను, గురుదేవుల వివిధ రచనలను, భజనలు, కీర్తనలను వినవచ్చును, చదువవచ్చును, డౌన్లోడ్ చేసుకొనవచ్చును. ఇక వివిధ గ్రంధాలపై గురుదేవుల ప్రవచనములను సి.డి.ల రూపంలోను, వీడియో DVD ల ద్వారా అందిస్తున్నారు.

ముందు ముందు మోక్షమార్గంలో పయనించే ఎందరికో మార్గ నిర్దేశనం చేయగల ఎన్నో గ్రంధాలు ముముక్షు జనావళిని తరింపజేయుటకు అందుబాటులోనికి రావాలని, అందుకు త్యాగధనులైన భక్తులు, సాధకులు, మోక్షార్థులు ముందుకు రాగలరని భగవంతుని మనసారా ప్రార్థిస్తున్నాను.

జ్ఞాన సూర్యునిలా ప్రకాశిస్తూ, నిస్వార్థంగా తన సేవలను అందిస్తున్న కర్మయోగి, సనాతనమైన వైదిక ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మాకు మార్గదర్శకులైన భగవంతుని ముద్దుబిడ్డ మా గురుదేవులను పరిచయం చేసే భాగ్యం నాకు కలిగించినందులకు భగవంతునికి శతసహస్ర వందనములు సమర్పించుకుంటున్నాను.

- శ్రీమతి రావూరి అన్నపూర్ణ

కార్య నిర్వాహక అధ్యక్షులు
ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం, చిలకలూరిపేట.

# తొలిపలుకు.

ఆచార్య శంకరుల గళం నుండి వెలువడిన “అనాత్మ శ్రీ విగర్హణం”, "ఆత్మపూజ” అనే ఈ చిన్ని గ్రంధాలు రెండూ ఆధ్యాత్మిక రంగంలో పురోగమిస్తూ ఉండే సాధకులకు అత్యంత ప్రయోజనకరమైన గ్రంధాలు. వీటిని శాస్త్ర విషయాలలో ఎంతో అనుభవం ఉన్న మహాత్ములనుద్దేశించి చెప్పటం జరిగింది.

కాశ్మీరదేశంలో 'సర్వజ్ఞపీఠం' అని ఒక అత్యున్నత పీఠం ఉన్నది. దానిని అధిరోహించాలంటే ఆనాడు శాస్త్ర విషయాలలో ఆరితేరిన ఉద్ధండులైన పండితులకే అర్హత ఉంటుంది. అప్పటివరకు దక్షిణాది నుండి ఆ పీఠాన్ని అధిష్ఠించిన మహాత్ముడు లేనే లేడు. శిష్యుల ప్రోత్సాహంతో శంకరాచార్యుల వారు కాశ్మీర దేశం వెళ్ళి శాస్త్ర పండితులతో వాదనలు జరిపి, అందరిని తన అపూర్వ మేధా శక్తితో, పాండిత్యంతో, వాక్ వైభవంతో, సిద్ధాంత బలంతో ఓడించి సర్వజ్ఞ పీఠాన్ని అధిష్టించేందుకు అర్హతను సంపాదించటం జరిగింది.

సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించిన శంకరులు అక్కడి పండితుల కోరిక మేరకు ఆత్మ జ్ఞానాన్ని బోధించుటకు సిద్ధమై, ఆత్మసాక్షాత్కారానికి - జీవన్ముక్తిని సాధించుటకు అవసరమైన అద్భుత జ్ఞానాన్ని 'ఆత్మబోధ' అనే గ్రంధ రూపంలో ప్రవచనం చేయటం జరిగింది. అయితే ఆత్మ సాక్షత్కారానికి అనాత్మను నిరసించుట, ఆత్మను పూజించుట ముఖ్యం గనుక అనాత్మ శ్రీ విగర్హణం అను పేర 18 శ్లోకాలతో అనాత్మ నిరసనను చెప్పి, 14 శ్లోకాలతో ఆత్మ పూజనెలా చేయాలో చెప్పి ఆ తరువాతనే 68 శ్లోకాలు గల ఆత్మబోధను ఉపమాన సహితంగా ప్రవచించటం జరిగింది. ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తూ, ఆత్మ జ్ఞానాన్ని పొంది సాధనలు చేస్తూ ఉన్న సాధకుల శ్రేయస్సు కొరకు అంతగా ప్రచారంలో లేని ఈ రెండు చిన్న గ్రంధాలను పరిచయం చేయుట కొరకు

'అనాత్మశ్రీవిగర్హణం' యొక్క 18 శ్లోకముల భావాన్ని, 'ఆత్మపూజ' యొక్క 14 శ్లోకముల భావాన్ని సంక్షిప్తంగా అందించటం కోసమే ఈ ప్రయత్నం. ఈ భావాలను స్వీకరించి, ఆచరణలో పెట్టుకొని తరువాత 'ఆత్మబోధ' గ్రంధాన్ని కూడా అధ్యయనం చేసి జన్మ సార్ధక్యతకు ప్రయత్నించగలరని ఆశిస్తూ - ఆశీర్వదిస్తూ..

- దేవిశెట్టి చలపతిరావు -

వ్యాఖ్యాత.

# అనాత్మశ్రీ విగర్హణం

18 శ్లో. భావములు.

1. రాజగౌరవాన్ని సంపాదించగల విద్య లభించినను; ప్రభావోపేతమైన సంపద కలిగియున్ననూ; సౌందర్యవతి ఐన కాంతతో భోగానుభవం కలిగినప్పటికీ ఏం ప్రయోజనం? ఆత్మసాక్షాత్కారం కలగనివానికి ఇవన్నీ నిష్ప్రయోజనములే. (ఆత్మానుభూతియే జీవన పరమార్థం)

2. కేయూరాది భూషణాలతో ఒప్పారుతున్నప్పటికీ; పీతాంబరాలు ధరించినప్పటికీ; ఇష్టమైన వంటకాలతో మృష్టాన్నం భుజించి తృప్తి చెందినప్పటికీ ఏం ప్రయోజనం? ఆత్మసాక్షాత్కారం పొందని వారికి ఇవన్నీ నిష్ప్రయోజనమేగదా? (ఇవన్నీ ఈ దేహమున్నంతవరకే గదా!)

3. అనేక దేశాలు సంచారం చేసినప్పటికీ; ఇష్టమైన బంధువర్గం వారిని అవసర సమయాల్లో ఆదుకుంటూ, సహాయం చేస్తూ, పోషిస్తూ ఉన్నప్పటికీ; దారిద్ర్యం వల్ల కలిగే దు:ఖాలుగాని, నష్టాలుగాని లేకుండా పోయినప్పటికీ ఆత్మసాక్షాత్కారం కలగనివానికి ఇవన్నీ నిష్ఫలమే గదా!

4. గంగా యమున మొ||న పవిత్ర తీర్థాలలో స్నానం చేసి పునీతుడైనప్పటికీ, షోడశమహాదానాలు చేసి అనంత పుణ్యఫలం సంపాదించినప్పటికీ; కోటి సంఖ్యలో జపము చేసినప్పటికీ లేదా మంత్రోచ్చారణ చేసినప్పటికీ ఆత్మసాక్షాత్కారం పొందని వానికి ఇవన్నీ నిష్ఫలములే గదా!

5. వంశానికి అలంకార భూతుడైనప్పటికీ; శరీరం అంతా భస్మంచేత ఆచ్ఛాదించబడినప్పటికీ, రుద్రాక్షాది మాలలు ధరించినప్పటికీ ఆత్మసాక్షాత్కారం కలగనివానికి ఇవన్నీ నిష్ఫలమే! (పుణ్య ఫలం పొందగానే పుణ్యం ఖర్చై పోతుంది)

6. భోజనాదులచే, విప్రులను సంతోషపరిచినా, యజ్ఞయాగాదులు చేసి దేవతలకు హవిర్భాగాలు సమర్పించినా, దిగంతాల వరకు కీర్తిని వ్యాపింపజేసినా ఆత్మసాక్షాత్కారం పొందని వానికి ఇవన్నీ నిష్ప్రయోజనమే గదా!

7. ఉపవాసాదులచే శరీరాన్ని కృశింపజేసినప్పటికీ, తన భార్యయందు పుత్రులను బడసినప్పటికీ; ప్రాణాయామాన్ని నియమంగా ఆచరించినప్పటికీ, ఆత్మసాక్షాత్కారం కలగనివానికి ఇవన్నీ నిష్ప్రయోజనమే.

8. యుద్ధంలో శత్రువులను జయించి నప్పటికీ, మిత్రులచే పరివేష్టితుడైయున్నప్పటికీ, యోగాభ్యాసంచేసి అణిమాది అష్టసిద్ధులు సంపాదించినప్పటికీ; ఆత్మసాక్షాత్కారం పొందని వానికి ఇవన్నీ నిష్ప్రయోజనమే.

9. పాదాలతో సముద్రలంఘనం చేసినప్పటికీ, కుంభక ప్రాణాయామంతో వాయువును నిలిపినప్పటికీ, మేరు పర్వతమును అవలీలగా చేతితో ఎత్తినప్పటికీ, ఆత్మసాక్షాత్కారం పొందని వానికి ఇవన్నీ నిష్ప్రయోజనమే.

10. విషమును పాలవలె త్రాగగలిగినను, అగ్నిని పేలాలవలె భక్షించగలిగినను, పక్షివలె ఆకాశంలో సంచరించగలిగినను, ఆత్మసాక్షాత్కారం కలుగనివానికి ఇవన్నీ నిష్ప్రయోజనమే గదా!

11. అగ్ని మొ|| న వానిని వశపరచుకొన్నను, లోహాన్ని ముక్కలు చేయగలిగినను, అంజనాదులద్వారా నిధి నిక్షేపాలను కనుగొని పొందగలిగినప్పటికీ ఆత్మసాక్షాత్కారం పొందనివానికి ఇవన్నీ నిష్ప్రయోజనమేగదా!

12. భూలోకంలో చక్రవర్తి పదవిని సంపాదించ గలిగినప్పటికీ, స్వర్గలోకంలో దేవేంద్ర పదవిని పొందగలిగినప్పటికీ, అరణ్యంలో తపస్సు చేసి మునీంద్రత్వాన్ని పొందగలిగినప్పటికీ, ఆత్మసాక్షాత్కారం పొందనివానికి ఇవన్నీ నిష్ప్రయోజనం.

13. మంత్ర బలంతో సర్వాన్ని స్తంభింపజేయగలిగినప్పటికీ; బాణంతో లక్ష్యాన్ని ఛేదించగలిగినప్పటికీ; కాలజ్ఞానాన్ని పొందగలిగినప్పటికీ ఏం ప్రయోజం. ఆత్మజ్ఞానం లేనివానికి ఇవన్నీ నిష్ప్రయోజనం.

14. కామావేశాన్ని అణగద్రొక్కగలిగినా; కోపావేశాన్ని పూర్తిగా తగ్గించుకోగలిగినా; లోభాన్ని పూర్తిగా విడిచిపెట్టినా, ఆత్మసాక్షాత్కారం పొందనివానికి ఇవి నిష్ప్రయోజనం.

15. ఈ జగత్తు, ఇందులోని భోగాలు సత్యమనే మోహాన్ని వదలగలిగినా; ఇతరులకున్న దానిని చూచి మాత్సర్యం చెందక పోయినా ఆత్మసాక్షాత్కారం కలగని వానికి ఇవన్నీ నిష్ప్రయోజనమే.

16. బ్రహ్మదేవుడుండే సత్యలోకాన్ని సాధించుకున్నా; విష్ణువు నివాసం ఉండే వైకుంఠాన్నిచేరుకున్నా; పరమశివుడుండే కైలాసంపై అధికారాన్ని సంపాదించినా ఆత్మసాక్షాత్కారం లేకపోతే ఇవన్నీ నిష్ప్రయోజనమే. ఎందుకంటే అవన్నీ అనిత్యాలు. పుణ్యం ఖర్చు కాగానే వాటిని వదలి తిరిగి రావాల్సిందే.

17. ఎవడైతే తన హృదయంలో ప్రతి రోజు చక్కగా ఈ అనాత్మ శ్రీ విగర్హణం చేస్తాడో - అనాత్మనింద - మిధ్యా విషయనింద చేస్తాడో అట్టివాడు వాటిపై గల వ్యామోహాన్ని విడిచి ఆత్మసాక్షాత్కారానికి అర్హత సంపాదిస్తాడు.

18. ఈ విధంగా అనాత్మ నింద చేయనివారు; చేయలేనివారు, చేయాలని తెలియనివారు ఈ (మాయా) మిధ్యాజగత్తులో, అనిత్యమైన విషయ వ్యామోహంలో చిక్కుకొని, మోహచిత్తులై, భ్రమలో - భ్రాంతిలో మునిగి పోయిఉంటారు. అట్టివారు ఈ భూమిపై ఎన్నటికీ ఆత్మసాక్షాత్కారం పొందలేరు.

ఇలా కాశ్మీరు పండితుల ఎదుట శంకరులవారు అనాత్మ శ్రీ విగర్హణం చేసి ఆ తర్వాత ఆత్మ పూజావిధానాన్ని తెలియజెప్పి చివరకు ఆత్మ జ్ఞానం కొరకు ఆత్మబోధను ప్రవచనం చేశారు.

# ఆచార్య శంకరుల

# ఆత్మ పూజ

అనాత్మశ్రీ విగర్హణం తర్వాత ఆత్మ పూజా విధానం గురించి వివరించిన తర్వాత ఆత్మబోధను శంకరులవారు వినిపించారు కాశ్మీర దేశంలో--

ఆత్మ పూజ - శంకరాచార్యులు. 14 శ్లో. భావములు

( 1 ) ఆత్మ అఖండం, సర్వవ్యాపకం, సచ్చిదానంద స్వరూపం, నిర్వికల్పకం, ఏకం- అద్వితీయం. అట్టి తత్వాన్ని ఎలా పూజించాలి? దానికన్నా రెండవదేదీ లేదు, రెండవ వారు లేరు గదా? పూజించేదెవరు? పూజింపబడేదెవరు? ఎందుకోసం ఎవరు పూజించాలి? ఆత్మ ఎప్పుడూ ఉండేది, సకలజ్ఞానస్వరూపం, ఆనంద స్వరూపం. దానికి పూజలేల?-

( 2 ) షోడశోపచార పూజలో మొదట ఆవాహనం చేస్తారు. ఆత్మ పరిపూర్ణతత్వం కదా! అది అంతటా నిండే ఉన్నది కదా! అట్టి ఆత్మను ఆవాహన చేయటం ఎలా? ఎక్కడకు ఆహ్వానిస్తాం? ఆత్మయే అన్నింటికీ ఆధారం. దాని ఆధారంగానే ఈ జగత్తు నిలిచి ఉన్నది. అట్టి ఆత్మకు ఆధారంగా ఆసనం ఏమి ఇవ్వగలం? ఆ ఆసనాన్ని ఎక్కడ వేయాలి? అర్ఘ్య పాద్యాదు లిచ్చి పూజించాలంటే ఆత్మ నిర్మలమైనది. అట్టి నిర్మల ఆత్మకు అర్ఘ్యం పాద్యం ఎందులకు? పరిశుద్ధ మైన ఆత్మకు ఆచమనం ఎందుకు? ఏదోషాలు తొలగించటానికి?-

( 3 ) దేహంపై మలినాలను తొలగించుకోటానికి స్నానం చేస్తాం. పరమాత్మ నిర్మలుడే గాక దేహం లేనివాడు. ఉపాధులు లేనివాడు. అట్టి వానికి స్నాన మెందులకు? వస్త్రం సమర్పిద్దామంటే ఈ బ్రహ్మాండమంతా ఆయన ఉదరమే. అంత వస్త్రం ఏది? నిరాకారునికి వస్త్రమెందులకు? అట్టి వానికి యజ్ఞోపవీతం మాత్రం ఎందులకు? ఆయనకు గోత్రంగాని, వర్ణంగాని, కులంగాని, గుణంగాని, దేహంగాని లేవుగదా| కనుక యజ్ఞోపవీతం మాత్రం ఎలా సమర్పించ గలం?

( 4 ) ఆయనకు శరీరమే లేదు. కనుక లేపనాల అవసరం లేదు. అట్టి నిర్లేపునికి గంధం ఎలా అద్దాలి. పుష్పం సమర్పిద్దామంటే ఆయన వాసనలే లేనివాడు. అంగాలు, అవయవాలు లేని ఆయనకు భూషణాలు, అలంకారాలు ఎలా చేయాలి?

( 5 ) నిరంజనము - నిష్కల్మషము అయిన ఆత్మకు ధూపంతో పనియేమి? పరమాత్మ సర్వసాక్షి . అట్టి పరమాత్మను చూసే మరొక సాక్షి ఎవరు? సర్వాన్ని వెలిగించి చూపించే ఆయనను చూపించటానికి దీపమేది? ఆత్మ స్వయం ప్రకాశం గదా! ఆయనే సూర్యునికి తేజస్సు నిచ్చేవాడు. అట్టి వానికి దీపమెందులకు? దీప కాంతిలో ఎలా చూడగలం? శాశ్వత ఆనంద స్వరూపమైన ఆత్మకు ఈ లోకంలో నైవేద్యం ఏముంది? ఎవరు సమర్పించగలరు నైవేద్యం?

( 6 ) స్వయం ప్రకాశమై, చిత్ స్వరూపమైనది ఆత్మ. అదే సూర్యచంద్రాదులను ప్రకాశింపజేసేది. కోటి సూర్య సమప్రభా తేజమై సమస్త విశ్వానికి ఆనందాన్ని చేకూర్చగల ఆత్మకు తాబూలం ఏమున్నది? ఏమివ్వగలం?

( 7 ) పరమాత్మ అనంతుడు. అంతం లేని వాడు, సర్వ వ్యాపకుడు. ఆయన లేని చోటు లేదు. అట్టి అనంత పరమాత్మకు ప్రదక్షిణం ఎలా చేయాలి? సర్వత్రా అది మాత్రమె ఉన్న

అద్వయమైన ఆత్మకు నమస్కరించటం ఎలా? ( ఆత్మ ప్రదక్షిణ - ఆత్మ నమస్కారం తప్ప ) ఉపనిషత్తులలోని మంత్రయుక్తమైన వాక్యముల ద్వారా తెలియబడే ఆత్మను స్తుతించే స్తోత్రాలు ఏమున్నాయి? దేనితో ఆయనను స్తుతించాలి?

( 8 ) నీరాజనం ఇవ్వాలంటే కర్పూరాన్ని వెలిగించాలి. అలా వెలిగించిన వెలుగు స్వయం ప్రకాశమానమై, కోటి సూర్యుల కాంతితో వెలుగొందే పరమాత్మ ముందు కనిపిస్తుందా? వెయ్యి క్యాండిల్ బల్బు ఐనా, మెర్క్యురీ బల్బు ఐనా ఒక్క సూర్యుని ముందు వెలవెలా బోతుంది. అసలు వెలుగుతున్నట్లే ఉండదు. మరి ఈ నీరాజనం ఆయన ముందు దిగదుడుపే గదా? అంతే గాదు. ఆ నీరాజనాన్ని పరమాత్మ చుట్టూ త్రిప్పాలంటే ఆయన సర్వవ్యాపకుడు గదా! ఎలా త్రిప్పాలి? ఇక ఉద్వాసన చెప్పాలంటే అంతటా ఉన్నది ఆయనే గదా? ఆయన లేని చోటేది? ఎక్కడకు పొమ్మన్నట్లు? ఆయన ఎక్కడి నుండో వస్తే గదా! ఎక్కడికో పొమ్మనటం కుదిరేది?-

( 9 ) ఈ విధమైన పరాపూజను బ్రహ్మవిదులైన వారు ( బ్రహ్మ జ్ఞానాన్ని పొందిన వారు ) సర్వకాల సర్వావస్థలలోను, ఏకాగ్రమైన చిత్తంతో చేయవచ్చు. దీనికై ప్రత్యేకంగా ఏర్పాట్లు గాని, వస్తు సంభారాలు గాని, తిథి వార నక్షత్రాలతో గాని పనిలేదు. ఏ స్థితిలోనున్నప్పుడైనా చేయవచ్చును. మంత్రాలతో గాని, పురోహితులతోగాని, డబ్బుతోగాని పనిలేదు.

( 10 ) శరీరాన్ని దేవాలయంగా భావించి, ఇందులోని జీవుడే సదాశివుడని - పరమాత్మయని గ్రహించి ఈ పరాపూజ చెయ్యాలి. భగవంతుడంటే ఫలానా ఆకారంతో ఉంటాడని, ఫలానా పేరుతో ఉంటాడని, దేవాలయంలోనో పుణ్యక్షేత్రంలోనో ఉంటాడని, జీవుడినైన నా కన్నా వేరుగా ఉంటాడని, ఉన్నాడని భావించే అజ్ఞానమనే మాలిన్యాన్ని

పూర్తిగా తొలగించి 'సో2హం ' ఆ పరమాత్మనేనే అనే భావనతో నిత్యమూ-నిరంతరము ఈ పూజకొనసాగించాలి. పరమాత్మ యొక్క నిరాకార, నిర్గుణ, సర్వవ్యాపక, సచ్చిదానంద తత్వంతో లీనం కావాలి.

( 11 ) నీవు నేను ఇరువురం అనంత స్వరూపులం. నేను నీవు శివ స్వరూపులం. అద్వయుడు, అనంతుడు అయిన దేవదేవునికి, సర్వోత్కృష్టుడైన పరమాత్మకు నమస్కారము. నిజంగా నేనే నీవు, నేవే నేను. ఇరువురం లేము. రెండు దేహాలు మాత్రమే ఉన్నట్లుగా ప్రతిభాసిస్తున్నాయి. ఒక్కటే అయిన ఆత్మయే నిజంగా ఉన్నది . ఆ ఆత్మయే పరమాత్మ - దేవాది దేవుడు - ఆది లేని దేవుడు, సర్వోత్కృష్ట పరమాత్మ . అట్టి పరమాత్మతో ఐక్యం కావటమే నమస్కారం. నమమః = నాది లేదు. నేను అహంకారం కాను.

( 12 ) యోగికి దేహాభి మానం. దేహాభిమానంతో ఉండి నిరాకార పరమాత్మతో ఏకత్వానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. దేహతాదాత్మ్యం వదులుకొనే ప్రయత్నం చేస్తుంటాడు. భోగికి కర్మాభిమానం. భోగాలనుభావించటం కొరకు స్వార్ధ బుద్ధితోనైనా కర్మలు చేస్తుంటాడు లేదా నిస్వార్ధంతో పరోపకార బుద్ధితో నైనా కర్మలు చేస్తుంటాడు. స్వర్గలోక భోగాల నాశించి దాన ధర్మాలు, పుణ్య కార్యాలు, యజ్ఞ యాగాదులు చేస్తుంటాడు. జ్ఞానానికి మోక్షాభిమానం. మోక్షం కోసం నిరంతరం శ్రమిస్తాడు. ఆత్మ జ్ఞానాన్ని పొందటానికి, వైరాగ్యాన్ని అలవరచుకోటానికి సాధనలు చేస్తుంటాడు. సత్వ గుణంలో ఉంటాడు.-అయితే తత్వ జ్ఞాని యందు ఏ అభిమానం ఉండదు. అతడు తన నిజ స్వరూపం ఆత్మయనే భావంలోనే నిర్లిప్తంగా ఉంటాడు. తాను జీవుణ్ణి అని భావించడు గనుక యోగం కొరకు ప్రయత్నించడు. పరిమితుణ్ణి - దుఃఖ పూరితుణ్ణి అని భావించడు

గనుక భోగాలకొరకు, సుఖాలకొరకు, కర్మలాచరించడు. అజ్ఞానిని అని భావించడు గనుక జ్ఞాన సిద్ధికొరకు యత్నించడు. ఆత్మగానే ఉండిపోతాడు. (మోక్ష సన్యాసి) .

( 13 ) మహా ప్రళయ సమయంలో బ్రహ్మాండమంతా జలమయం అయి ఉన్నట్లు అంతటా ఆత్మయే ఉన్నది. ఏం చేయను? ఎక్కడకు వెళ్ళను? దేనిని గ్రహించను? దేనిని త్యజించను?-

( 14 ) నీవే ఆత్మ (శివుడు). బుద్ధి పార్వతి. (గిరిజ = తుషార శైలసుత - పర్వతరాజ తనయ పార్వతి) ప్రాణాలు సహచరులు. శరీరమే గృహం, వివిధోపభోగరచనయే నీ పూజ, నిద్రయే సమాధి. పాద సంచారమే ప్రదక్షిణ విధి. వాక్కులన్నీ స్తోత్రాలే. నేను ఏ ఏ కర్మ చేస్తానో అది అంతా నీ ఆరాధనయే. చిదాభాసుడే (ఆత్మ)- శివుడు, బుద్ధి పార్వతి, పంచ ప్రాణాలే ప్రమధ గణాలు. శరీరమే కైలాసం ( గృహం ) ఇంద్రియాల ద్వారా జరిగే కర్మలు, పొందే అనుభవాలు అన్నీ నీ పూజ. నిద్రయే సమాధి స్థితి. పాదాలతో ఎక్కడకు తిరిగినా అది నీ ప్రదక్షిణయే. నోటితో పలికే పలుకులన్నీ స్తోత్రపాఠాలే. ఇలాంటి భావనతో మనం మన విద్యుక్తకర్మలు చేస్తూ ఉంటే అవి అన్నీ భగవదారాధనయే అవుతుంది. అందుకే ఏ ఏ కర్మలు చేస్తున్నానో అవి అన్నీ శంభో : నీ ఆరాధనయే అనుట.

"యద్యత్కర్మ కరోమి తత్త దఖిలం శంభో తవారాధనం"

యత్ యత్ కర్మ కరోమి తత్ తత్ అఖిలం శంభో తవారాధనం.

- ఏ ఏ కర్మ చేస్తున్నానో ఆయా కర్మలన్నీ పరమేశ్వరా నీ పుజయే (ఆరాధనయే).

# <u>కృతజ్ఞతలు</u>

ఈ గ్రంధాన్ని అందించడములో మాకు సహకరించిన చెన్నై నివాసులు

**'శ్రీమతి రాచపూడి జ్యోతి'** గారికి

ప్రత్యేక కృతజ్ఞతలు. వారికి సదా భగవానుని దివ్య ఆశిస్సులు లభించగలవని ఆశిస్తూ ...

శ్రీ దేవిశెట్టి చలపతిరావు

గ్రంధ వ్యాఖ్యాత